# ఫిదేలు మేజరు

"మా జి. పి. టి. కంపెనీలో అనేక గమ్మత్తులు జరుగుతూంటాయి. ఆఫీసర్లకూ మాకూ గూడా తమాషాలు జరుగుతూంటాయి" అన్నాడు అవుల్దార్ ఎంకన్న బీడీ ముట్టిత్తూ బ్రిడ్జిదగ్గిర తనిఖీ సేత్తూ.

మాది ఇంకో జి. పి. టి. కంపెనీ. ఆ రోజే కాన్వాయితో వచ్చాం. ఈళ్ళ కంపెనీ దగ్గిరే గుడారాలేశాం.

"నిన్న రాత్రేందో గంద్రగోళం అయిందంటగాదురా!" అన్నాను నేను.

"నిన్న రాత్రి గంద్రగోలానికి ఇయ్యాల పొద్దున నడుములు విరిగాయి." అన్నా డెంకన్న.

"ఏంటిరా ఆ గంద్రగోలం?" అన్నాను.

"నడుములు ఇరిగినా రాత్రి మాత్రం ప్రతి సిపాయీ తమాసా పడ్డాడు." అన్నాడు.

"ఏందిరా సమాచారం అసలూ?" అన్నాను.

"మా మేజరు ఫిడేలు వాయించాడు!" అన్నాడు.

"ఇంతేనా!" అన్నాను.

"ఇంతేనా కాదు, అసలు కత చాలా ఉంది" అన్నాడు.

"అయితే సెప్పవేం మరీ!" అన్నాను.

"మా మేజరుకు పిడేలంటే పెండ్లాంకన్న ఎక్కువిష్టంరా. రాముడుకు సీత ఉంది. కిష్టుడుకు రాధుంది. మా మేజరుకు పిడేలుంది." అన్నాడు. మళ్ళీ బీడీ ముట్టించాడు. "అసలు మొదట ఆయన్ను 'నవాబ్' అని పిలిసే వాళ్ళం. నవాబ్ అంటే నవాబంత దర్జాగలోడని కాదు. నిజానికి చాలా మంది చాలా పేర్లతో పిలిసేవాళ్ళు.

గట్టివోడాయన. టాంకులమీద శర్మంగూడా వలిసేసేటంత పట్టు గలోడు. అయితే ఆయనా మనిసేగా. ఆయనకో యసనం ఉంది. అదేటంటే పిడేలు!

ఆయన టెంటులో కూకుని పిడేలుమీద సెయ్యేట్టినప్పు డాయన మొగం సూడాలి. ఆనందం చూపిత్తున్నా ననుకుంటాడు గామోను. భూకంపం వచ్చినప్పుడు నేలెట్లా ఉంటుందో అట్లా ఉంటుంది. గుండెల్లో ఉంటుం

దేమో ఆ ఆనందం. ఇతరుల కెవ్వరికీ కలగదు. ఎందుకంటే ఆయన పిడేలు వాయిత్తుంటే బొంయి బొంయిమని మొరిగే కుక్కలుగూడా క్యాంప్ విడిచిపెట్టి తెల్లారేదాకా రావు.

మేమంటే మాకు డూటీ!

డూటీ ఎటువంటిదో తెలుసా? ఓ రోజు మా సెక్షన్ లెఫ్టినెంటు బడా బూట్లతో మేజరు టెంటువక్క నుంచి పట్ పట్ మనుకుంటూ పోతు న్నాడు. లోపల మేజరు పిడేలు వాయిత్తున్నాడు. ఆపి లెఫ్టినెంటును పిలిసి గంటన్నర లెక్చరిచ్చాడు. బైటికొచ్చేప్పటికి లెఫ్టినెంటు మొగం ఎఱ్ఱగా ఉంది. షర్టు చమటలతో ముద్దకట్టింది.

అందుకనే తెలివితేట లుపయోగించాలి మేజరు పిడేలు ఇసయంలో.

మేజరు పిడేలూ మా తెలివితేటలూ సెయ్యీ సెయ్యీ పట్టుకొని చాన్రోజుల నుంచీ తిరుగుతున్నాయి మా క్యాంపులో!

కనక ఆ రోజు, మేజరు, కంపెనీకంతా ఎందుకు టీపార్టీ ఇచ్చాడో టీపార్టీ అయింతర్వాత ఎందుకు చౌచౌ నాటకం ఏయిత్తున్నాడో అందరికీ తెలుసు—ఆయన పిడేలు విద్దె సూపించడానికి.

ముందు మాకు సూపిత్తే ఆయనకు దైర్నం వత్తుంది. రోజల్లా టెంటులో కూకుని వాయించడమేగానీ యారిముందరా వాయించలేదు. ఆయన చకండ్ ఇన్ కమాండు క్యాప్టెను ముందు గూడా యెప్పుడూ వాయించలేదు. అయితే సంవచ్చరంనుంచీ కష్టపడుతున్నాడు. ఎందుకో తెలుసా?" అని నా వొంక కొట్టొచ్చేవోడల్లే మిర్రి మిర్రి సూశాడు అవుల్దా రెంకన్న.

"మీ కంపెనీ యినయాలు నా కెట్టా తెలుత్తుందిరా?" అన్నాను నేను.

"ఆ మద్దె సిల్లాంగులో ఓ నర్సును సూశాడురా మేజరు. దాంతో

చేహం చేశాడు. అది పియానో అంట వాయించిందంట. 'నీకు పిడేలు వాతవునా?' అని అడిగిందంట. "వాతవును, నా పిడేలిక్కడలేదు. మళ్ళీ వొచ్చినప్పుడు తెత్తానన్నాట్ట" అప్పట్నుంచీ దాన్ని ఛినీమాలల్లోనూ రెస్టారెంట్లల్లోనూ కలిసేవాడేగాని ఇంటిదగ్గిరకు పోటంలా! పిడేలు విద్దె పూర్తి చేసుకుని పోదామని ఉద్దేచం. అక్కడికి పోకముసుపు మా ముందర ఆ విద్దె సూపించి డైన్నం తెచ్చుకుని ఆ తర్వాత పోదామని." అన్నాడు యంకన్న.

"మాంచి తెలీగలాడ్రా" అన్నాను.

"ఆయనకు తెలుసు. టీ పార్టీలోగూడా దూటీగానే కూకుంటాం అనీ పిడేలు వాయించేప్పుడు గూడా దూటీగానే కూకుంటాం అనీ. ఎప్పుడు సప్పట్లు కొట్టాలో అప్పుడే కొడతాం అనీ. ఎప్పుడు శబాస్ అనాలో అప్పుడే అంటాం అనీ గూడా తెలుసు. అందుకనే ఆ టీ పార్టీ. అందుకనే ఆ చౌచౌ నాటకం."

టీ పార్టీ కాంగానే అంతా దేరా హాలులో కూకున్నాం. ముందర క్యాప్టెనూ అయిదుగురు లెప్టినెంట్లూ కూకున్నారు. అరవంలో ఓ ఆట ఆడారు. తెలుగులో ఒకటీ, ఉర్దూలో ఒకటీ. తెర అప్పుడే వేసి, మళ్ళీ తెరిశారు. అంతకు మునుపే లోపలి కెళ్ళిన క్యాప్టెను నుంచున్నాడు. అటొకసారీ ఇటొకసారీ వొంగాడు. ఓ డోసు యేసినట్టున్నాడు. "ఇంక మేజరుసాబ్ పిడేలు పెదర్సనం ఉంది జాగర్తగా ఇనండి" అని ఉర్దూలో అన్నాడు. ఇంకా ఏంవో అందాం అనుకున్నాడుగాని మాటెత్తితే మైమరుత్తానేమో అనుకున్నాడు గామోసు, లటుక్కున ఓ గంతేసి బయటికెళ్ళాడు. తెర వాలింది. మేజరుకు అవ్వానంగా సప్పట్లు కొట్టాం. అయిదు నిముసాలైనా సప్పట్లాగలేదు. లోపలనుంచి సప్పట్లు ఆపాలి అని కబురొచ్చింది. దూటీ దూటియే. సడీసప్పుడూ లేదు.

తెర తెరిశారు. కుర్సీమీద కూకున్నాడు మేజరు. సేతిలో పిడేలు పట్టుకున్నాడు, ఓ పావురాన్ని పట్టుకున్నాడల్లే.

ఆయన్ను సూసి సంతోసం తెల్పడానికని మళ్ళీ సప్పట్లు కొట్టాం. మద్దె మద్దె కొంతమంది మూలిగేరు. కొంతమంది యీలలేశారు. ఇంకా ఏందేందో సేశారు. ఎవరూ ఆగలేదు. మామూలు సంతోసం సూపించేంత సేపుకన్నా ఎక్కువ సేపు సప్పట్లు కొడుతున్నారు. హాల్లన్నట్లుగా పిడేలు బెత్తం పైకెత్తి గుడ్లు మిర్రిమిర్రి సూశాడు. యంటనే అంతా ఊరుకున్నారు.

తల్లి పసిబిడ్డ తలమీద ఆముదం యెంత మెత్తగా మెల్లిగా పెడుతుందో అంత చుకుమారంగా పిడేలు తీగెలమీద పిడేలు బెత్తమెట్టాడు.

పాంగ్ పాంగ్ పాంగ్ మంటూ ఫాట్ మంది పిడేలు.

కుర్సీమీంచి ఎగిరి యనక్కు పడ్డాడు మేజరు.

వొంగుని పగిలిన పిడేలును కరిసిన పిచ్చికుక్కను సూసినట్లుగా సూశాడు మేజరు.

హాలంతా గంద్రగోలం అయింది. అంతా లేశారు. ఈలలేశారు. సప్పట్లు కొట్టారు. మూలిగారు. చీదారు. దగ్గారు. ఇంకా యేందో యేంటో సేశారు.

వోడన్నాడు. "మెచీన్ గన్లు పట్టుకునే వోళ్ళు పిడేళ్ళు పట్టుకుంటే యలారా!" అని.

మేజరు లేశాడు. కోటు సవరించుకున్నాడు. "క్యాప్టెన్! టుమారో 'ఓల్ కంపెనీ టూ అవర్సు ఫ్యాక్ డ్రిల్ రోడ్డు మార్చి!" అన్నాడు.